# పేవ్‌మెంట్

అది మహానగరం.

నాగరికులు నివసించే మహానగరం.

ఫ్లోరసెంట్ లైట్లకాంతి మంచుతో తడిసి మందకొడిగా వుంది. ఆ మందకొడి కాంతిలో రెండు పేవ్‌మెంట్ల మధ్యగా వున్న నల్లని తార్రోడ్డు నిశ్శబ్దంగా ప్రవహిస్తోన్న చీకటిలా వుంది.

రెండు మూడు గంటల క్రితం వరకు నగర నవనాగరికతను చవి చూసిన పేవ్‌మెంట్లు నగరంలోని అనాగరికతకు జోలపాడుతున్నాయి. రకరకాల రంగు రంగుల మనుషులు పగలంతా రాత్రి పదిగంటలదాకా ఆ పేవ్‌మెంట్లమీద నడిచారు. నగరం మాటుమణిగిన తరువాత అదే పేవ్‌మెంట్ల మీదకి గూడు లేనివాళ్ళు, నీడలేనివాళ్ళు చేరుకున్నారు. చిరిగిన గోనెలు, దొరికిన పేపర్లు పరుచుకుని నడుములు వాల్చారు. చలి కొరుక్కుతింటూంటే నిలువుపొడుగు మనుషులూ ముడుచుపోయి ముద్దల్లా ఆ పేవ్‌మెంట్లమీద పడున్నారు.

ఆ రోడ్డుకు యిటూ అటూ వున్న షాపులన్నీ నిద్రపోతున్నాయి.

షాపులపై వున్న భవనాలు నిద్రపోతున్నాయి.

భవనాల్లోవున్న నాగరికులు నిద్రపోతున్నారు.

నల్లని తార్రోడ్డు నిద్రపోతోంది, గుళ్లోదేవుడు నిద్రపోతున్నాడు.

కాని గడియారం స్తంభంమీద గడియారం— షాపుల తాళాలమీద బేట్రీ ఫోకస్‌చేస్తూ కర్ర చప్పుడుచేస్తూ తిరిగే గూర్ఖా, రెండో ఆట సినిమాజనం, నైట్‌బీటు కానిస్టేబిల్స్, ఫ్లోరసెంటు దీపంకింద మంట వేసుకుని చలికాగుతోన్న ముసలివాడు, అప్పుడప్పుడు యిటూ అటూ తిరుగుతోన్న కార్లు లారీలు యింకా నిద్రపోలేదు.

అల్లంత దూరంలో రెండోఆట సినిమా వదిలాక తగిలే గిరాకీ కోసం ఓ కిళ్ళీకొట్టు కునికిపాట్లు పడుతోంది.

నిద్రపోతూన్న గుడిముందు ఆకలితో నిద్రపట్టని కుక్క ఆకుల్ని కాగితాల్ని వాసనచూస్తూ మూలుగుతూ ముక్కుతూ పచారు చేస్తోంది.

మంటదగ్గర చలికాగుతోన్న ముసలివాడి యిల్లూ ఆఫీసు ఆ పేవ్‌మెంటే. ఆ వరసలోనే కాస్త ఎడంగావున్న హోటల్‌ముందు పగలంతా అడుక్కుంటాడు. రాత్రయ్యేక హోటల్‌లోంచి బయటపడిన ఎంగిలాకుల్లోని మెతుకులకోసం కుక్కలతోటి, తన తోటివాళ్ళతోటి కలియబడి పొట్ట నింపుకుందుకు తాపత్రయపడతాడు. ఆకలిగా వున్నపుడు తనతోటివాళ్ళు, కలియబడే కుక్కలు అంతా పరమశత్రువుల్లాగే అగుపిస్తారు ముసలాడికి. ఆకలితీరాక తన సీమ వెండిగిన్నెలో నాలుగు మెతుకులు ఎప్పుడేనా మిగిల్తే ఆ కుక్కలకే పడేస్తాడు. అవి కొట్లాడుకుంటోంటే "కొట్టుకుసావకండే మీ యమ్మో" అని హితబోధ చేస్తాడు. వాడికి కాలూ చెయ్యి వంగినప్పటినుంచి అది వాడి దినచర్య. రాత్రయ్యేసరికి ప్రెస్ దగ్గరికి చేరతాడు. ప్రెస్‌ముందు పడివున్న కటింగ్ చెత్తని పోగుచేసుకుంటాడు. పేవ్‌మెంట్‌మీద పరచిన సిమెంటురాళ్ళకి మధ్య వున్న మట్టిని సిమెంటుని పీపాకట్టురేకుతో గోకేసి, కాగితాలు పరుచుకుని నడుం వాలుస్తాడు. రాయీ రాయీ మధ్య సందుల్లోంచి పేవ్‌మెంటు అడుగున ప్రవహించే డ్రైనేజి లోంచి వచ్చే వెచ్చని ఆవిరే వాడికి చలికాపు.

అలా దేశంలోని ధర్మం, హోటల్‌లోని ఎంగిలాకులూ. డ్రైనేజి ఆవిరి, ఆ పేవ్‌మెంటు ఎప్పుడో చావాల్సిన ముసలాడిని చావనివ్వకుండా బతికిస్తున్నాయి. వాడు చావలేక బతుకుతున్నాడు. కాగితాలైపోయాయి. ఇంక పక్కవేసుకునే కాగితాలే వున్నాయి. వాడు దగ్గుతూ లేచి కాగితాలు పరుచుకుని నడుంవాల్చాడు.

"అమ్మయ్య? ముసలినాయాలు యిప్పటికి నడుంవాల్చాడు" అనుకున్నాడు కాస్త ఎడంగా పడుకున్న రంగయ్య.

రోడ్డుమీద రద్దీ తగ్గినప్పట్నించి ముసలాడు నిద్రపోతాడేమోనని కళ్ళలో ఒత్తులువేసుకు చూస్తున్నాడు రంగయ్య. వాడు దగ్గుతూ, రొప్పుతూ, సణుక్కుంటూ, ఎవర్నో తిట్టుకుంటూ కంచుకాగడాలా అలా కూర్చునే వున్నాడుకాని నడుం వాల్చడంలేదు.

ఇంక ఫరవాలేదనుకుని పక్కనేవున్న మంగి కాలుమీద కాలేశాడు. దగ్గరగా చేరదామంటే ఏడాదిపిల్ల ఆదమరచి నిద్రపోతోంది యిద్దరిమధ్యా.

మంగి కదల్లేదు.

"ఒలేయ్ మంగే! ఏయ్ మంగా — నిన్నేనెహ" గుస గుసలాడేడు. మంగి నోటితో బదులు పలకలేదుగాని అంతకుమించిన సమాధానమే యిచ్చింది. రంగయ్య కాలుమీద తనకాలు వేసింది. మంగి తన రెండుకాళ్ళమధ్యకి రంగయ్య కాలుని తీసుకుని అదిమింది.

రంగయ్య కాస్త దగ్గరగా జరిగి మంగి భుజంమీద చేయివేసి దగ్గరికి లాక్కోపోయాడు. ఇద్దరిమధ్యనా వున్న పిల్ల ఏ కాలో చెయ్యో నలిగి కెవ్వుమంది.

"దీనమ్మా...యిదొక్కతి పానకంలో పుడకలాగ" అని పిల్ల పిర్రమీద ఒక్కటి చరిచాడు రంగయ్య.

"నేన్లే, మంచోడివే" అంటూ పిల్లని గుండెలమీదకి తీసుకుని, పమిటె ఒత్తిగించి రొమ్ముగుడిపింది మంగి. పిల్లని అవతలపక్కకిచేర్చి అటు ఒత్తిగిల్లింది.

రంగయ్య వీలుగా దగ్గరయ్యాడు.

ఇంతలో పాదరసంలా తార్రోడ్డుమీద పరుగెడుతున్న కారుకి అవతలపక్కన పచారుచేస్తున్న కుక్క యీవలిపక్కకి రాబోతూ అడ్డం పడ్డంతో కారు విలవిల్లాడుతూ ఆగింది.

ఆచప్పుడికి రంగయ్య తలెత్తి చూశాడు.

పెదవులమధ్య సిగరెట్టును నొక్కి 'డర్టీ బిచ్' అన్నాడు స్టీరింగు దగ్గరనున్న వ్యక్తి.

లైటువెలుగులో తియ్యని దృశ్యం రంగయ్య కళ్ళబడింది,

ఫర్‌కోటులో పొదిగివున్న రంగుల రబ్బరుబొమ్మకి తగులుతోన్న చిరుచలిగాలికి కాపుగా, స్టీరింగ్‌దగ్గరున్న మనిషి ఎడమచేత్తో ఆమెను మరింత దగ్గరగా అదుముకున్నాడు. ఆమె అతని మెడచుట్టూ రెండు చేతులూ చుట్టి అతనిభుజంమీద వాలింది.

రంగయ్యఒళ్ళు వేడెక్కింది. మంగిని మరింత దగ్గరకు తీసుకున్నాడు. పిల్ల నిద్రపోయింది. మంగి రంగయ్యవైపు తిరిగింది. ఇద్దరూ వెచ్చని శ్వాస వదులుతున్నారు.

ముసలాడికి దగ్గుతెర ముంచుకొచ్చింది. ఊపిరాడక లేచి కూర్చున్నాడు.

పక్కనున్న నాలుగు కాగితాలు ఏరుకొని మళ్ళీ మంటేశాడు.

రంగయ్యకి ఒళ్ళు మండింది. మంగి అటు వత్తిగిలింది.

"ఈడమ్మా, యీడికి నిద్రానిప్పులు లేవు. మళ్ళా కుళ్ళుకుళ్ళు మంటా ?" అనుకొని, యింక వుండబట్టలేక — "యింక తొంగోయహ,

తెల్లార్లూ మంటలేయటం, కుళ్ళు కుళ్ళుకుంటా దగటమూను. తక్కినోళ్ళు తొంగోవాలా అక్కర్లేదా ?" అని విరుచుకుపడ్డాడు రంగయ్య.

"నాఅడు నీకేపెహ, నిన్ను తొంగోవద్దన్నానా ?" అన్నాడు ముసలాడు వస్తోన్న దగ్గును ఆపుకుంటూ, మరి నాలుగుకాగితాలు మంట కెగదోస్తూ.

"శనినాయాల" అని సణుక్కున్నాడు రంగయ్య.

ఇంక వుండబట్టలేక లేచి కూర్చున్నాడు.

"నేన్నే తొంగో" అంది మంగి.

"ఉండెహే" అని యిటూ అటూ చూసి లేచాడు రంగయ్య. దగ్గర్లో దొరికిన ఓరాయితీసి గురిచూసి కసిగా విసిరాడు. ఫ్లోరసెంటు లైటు భళ్ళున బద్ధలైంది. వెలుగుపోయి దట్టమైన నీడ పేవ్ మెంటుమీద పడింది.

విసరిన రాయిని చూడనిముసలాడు 'ఉత్తిపున్నాన పగిలిపోయిందేం పాపం యీ లైటు' అనుకున్నాడు.

మంగికి దగ్గరగా చేరాడు రంగయ్య అదుపులేకుండా.

గడియారం స్థంభం నాలుగు కొట్టింది.

ఇంటికి పోతున్న గూర్ఖా ముసలాడి మంటదగ్గరకొచ్చి మంటెగ దోసాడు బీడీ కాల్చుకుందుకు.

మంగి రంగయ్యకి కాస్త ఎడంగా జరిగింది.

బీడీ ముట్టించుకుపోక ముసలాడితోసొదపెట్టాడు గూర్ఖా! రంగయ్య ఊపిరి బిగపట్టుకొని వున్నాడు.

గూర్ఖా వెళ్ళిపోయాడు,

'అమ్మయ్య' అనుకున్నాడు రంగయ్య.

మంగిని యిటు తిప్పాడు.

16)

'ఉః నువ్వు నిద్రోవ్. నన్ను నిద్రోనివ్వవ్' అని చిరాకుపడింది మంగి.

'ఏం పూసులెహ. నీకుమాత్రం నిదర పట్టుతుందేటి? అంతా బెట్టు కాని' అంటూ మీదకాలేసి దగ్గరగా అదుముకున్నాడు మంగిని రంగడు. మంగి రంగయ్య మెడచుట్టూ చేతులు మెలేసింది.

ఇంతలో హోటల్ మేల్కొంది. హోటల్ కటకటాల్లోంచి లైటు పేవ్ మెంటు మీదకి పడుతోంది.

'ఈ హోటలోడి కప్పుడే తెల్లారింది?' అని చిరాకుపడ్డాడు రంగయ్య,

రెండెడ్లబళ్ళు తోరణంలా వస్తున్నాయి రోడ్డునపడి.

బళ్ళ అడుగున వేలాడుతోన్న లాంతరు వెలుగు చక్రాల సందుల్లోంచి పేవ్ మెంటుమీద పడుతోంది.

'ముసలోడు సూత్తన్నాడు' అంటూ మంగి మళ్ళీ దూరమైంది రంగయ్యకి.

'ఏటిసూత్తాడే గుడ్డినాయాల. సూత్తే సూడనీయహ. అన్నీ పుడిగిన సన్నాసిగోడు' అంటూ బలవంతంగా దగ్గరికి లాక్కున్నాడు.

ఇంతలో చీపురు బరబరలు వినిపించాయి.

ప్రెస్ముందు ఊడ్చి నీళ్ళు చల్లడానికి పనిమనిషి వచ్చింది.

'యింక నెగండి నెగండి' అంటూ చీపురు బరబర్లాడిస్తోంది.

గడియారం స్థంభం అయిదు కొట్టింది.

'నీకప్పుడే తెల్లారిపోనాది?' అన్నాడు రంగయ్య.

'తెన్నారదేటి మరి? యిల్లాటి గుమ్మాలు ఏడూడవాలి వెలుగు రాకుండా., తెల్లారకుండా వుండాలంటే మేడోటుచ్చుకొని తొంగుంటే సరి' అంది వూడవడాని కొచ్చిన మనిషి.

'బాగా సెప్పావ్' అంటూ లేచిపోయింది మంగి.

రంగయ్య గోనిపట్టా చుట్టేశాడు లేచి.

మంగి, రంగయ్యా ఆ పేవ్‌మెంటుమీదే మొట్టమొదటిసారి కలిసారు.

వాళ్ళ తొలిరేయి పాన్పు ఆ పేవ్‌మెంటే.

మంగి తల్లయిందీ ఆ పేవ్‌మెంటే,

అదే వాళ్ళ హంసతూలికాతల్పం.

అదే వాళ్ళ స్వీట్‌హోం.

అదే వాళ్ళ సంసారం.

యిల్లాటి రాత్రులు వాళ్ళెన్నో గడిపారు,

రంగయ్యకి కోపం వుంది. కోరిక లున్నాయి. తన సుఖానికి అడ్డు వచ్చిన వాళ్ళమీద తిరగపడ్డం తెలుసు.

అందుకే ఒంటరిగా కూర్చున్న ముసలాడిమీద విరుచుకుపడ్డాడు.

అడ్డుగావున్న ఫ్లోరసెంట్ లైటుని గురిచూసి రాయి విసిరాడు.

నిజంగా తన సుఖాన్ని దోచుకుంటున్న వాళ్ళెవరో తెలిస్తే-తన సుఖానికి అడ్డుగా అగుపించిన ముసలాడిమీద విరుచుకుపడ్డు. లైటుమీదకి రాయిని గురిపెట్టడు.